వైభవంగా విజయదశమి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: మంచికి విజయాన్ని అందించాలని కోరుకుంటూ.. విజయదశమిని జిల్లా ప్రజలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాలు, వివిధ మండలాలు, గ్రామాల్లో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయాల్లో జంబి చెట్టుకు పూజ చేశారు. దేవతామూర్తులను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. దసరా రోజున పాలపిట్టను చూడటం శుభప్రదమని చెబుతుంటారు. గ్రామీణ ప్రాంత జనం పంట పొలాల వైపు పాలపిట్ట కోసం వెళ్లారు. ఆయా చోట్ల రావణదహనం నిర్వహించారు. శమీపూజలు చేసి బంగారాన్ని బంధుమిత్రులు, పెద్దలకు ఇచ్చి ఆశీస్సులు, అభినందనలు అందుకున్నారు. ఆత్మీయంగా ఆలింగనాలతో శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. బంగారు, నూతన వాహనాల కొనుగోలు చేసి ఆలయాల్లో పూజలు చేయించుకున్నారు.


కామారెడ్డిలో భక్తులకు ప్రవచనాలు వినిపిస్తున్న పండితుడు


బీబీపేట: జనగామలో దాండియా ఆడుతున్న మహిళలు


మద్నూర్‌లో రావణ దహనం

తండ్రి రాసిన మరణశాసనం

జిల్లాలో సంచలనంగా మారిన నందివాడ ఘటన

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, తాడ్వాయి: మానసిక వేదన ముగ్గురి ఊపిరి తీసింది. అత్తింట్లో గౌరవం దక్కడం లేదని, తాను చిన్నచూపునకు గురవుతున్నానని మానసిక వేదనకు గురయ్యాడు తాడ్వాయి మండలం నందివాడకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి. దసరా రోజున తాను ఆత్మహత్య చేసుకోవడమే కాకుండా ఇద్దరు కుమారులను బావిలో పడేసి వారి ఊపిరినీ తీశాడు. ఒకే ఇంట్లో ముగ్గురు చనిపోవడం గ్రామస్థులను కలిచివేసింది.

కదిలివచ్చిన గ్రామస్థులు

పసిపిల్లలు ఇద్దరు పడిన బావి వద్దకు ఆదివారం ఉదయం ఊరంతా కదిలి వచ్చింది. తొలుత విఘ్నేష్‌రెడ్డి, అనిరుధ్‌ల మృతదేహాలు బావిలో తేలగా.. శ్రీనివాస్‌రెడ్డి ఆచూకీ లభించలేదు. అతడి కోసం కుటుంబీకులు, గ్రామస్థులు గాలింపు చేపట్టారు. బావి సమీపంలో శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన చరవాణి, చెప్పులు కనిపించాయి. దీంతో బావిలోని నీటిని తోడేసి గాలించడంతో అతడి మృతదేహం లభించింది. చనిపోయిన పిల్లలు ఇద్దరు తాడ్వాయి మండలకేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. గత నెలలో చిన్నకుమారుడి పుట్టిన రోజు వేడుకలను సైతం కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. దసరా పండగను పురస్కరించుకొని పిల్లలకు కొత్త దుస్తులు కొనిచ్చారు. ఈ సమయంలోనే తనకు కొత్త బట్టలు కొనివ్వాలని శ్రీనివాస్‌రెడ్డి భార్య అపర్ణను, కుటుంబీకులను కోరగా.. ఉన్నవాటితో సరిపెట్టుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. ఇల్లరికం వచ్చానని, తనను చిన్నచూపు చూస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన చెందినట్లు బంధుమిత్రులు వెల్లడించారు. 'ఎప్పటికీ నా బతుకు ఇంతే'నని మానసిక వేదనకు గురయ్యాడు. తన పిల్లలు సైతం భార్య వద్ద ఉండకూడదని కుమారులిద్దరిని బావిలో పడేసినట్లు తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

ఆనందం... కన్నీరు

చిన్నారులు దసరా పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. దుర్గామాత మందిరంలో సందడి చేశారు. తనను అత్తింటివారు చిన్నచూపు చూస్తున్నారనే ఉద్దేశంతో శ్రీనివాస్‌రెడ్డి చిన్నారులకు మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లాడు. మాటల్లో పెట్టి వారిని బావి వద్దకు తీసుకెళ్లి పడేసి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి వరకు ఆనందంగా ఉన్న కుటుంబంలో విషాదం నెలకొంది.

దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు

శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరు బిడ్డలను చంపి, తానూ ఆత్మహత్య చేసుకోవడానికి కుటుంబం చిన్నచూపేనా లేదా మరేదైనా కారణం ఉందా ? అనే కోణంలో పోలీసులు విచారణ మొదలు పెట్టారు. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబీకులు, గ్రామస్థుల నుంచి వివరాలు ఆరా తీస్తున్నారు. మృతదేహాల పోస్టుమార్టం తర్వాత వచ్చే నివేదిక ఆధారంగా విచారణ చేపట్టాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడడంతో మొదలైన ఆర్థిక ఇబ్బందులతోనే శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఘటనాస్థలాన్ని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఎందుకిలా.. చేశావ్ నాన్నా..?

దసరా పండగొచ్చింది
మా అన్నాదమ్ములకు
ఒకే రంగు కొత్త దుస్తులు తెచ్చావు
భలే ఉన్నాయని మురిసిపోయాం.. నాన్న

పండగ రానే వచ్చింది
ఆ దుస్తులు వేసుకున్నాం
ఎంచక్కా.. నీ చేయి పట్టుకొని
ఉత్సవాలు చూడడానికి బయల్దేరాం.. నాన్న

నువ్వు అడుగులు వేస్తూ ఉంటే..
అడుగుల్లో అడుగులమై వెంటే వచ్చాం
చీకటి పడుతున్నా.. జంకలేదు
మా ధైర్యం ఎప్పుడూ నువ్వే.. నాన్న

చూస్తుండగానే.. బావి వద్దకు తీసుకొచ్చావ్
కాపాడే చేతులతోనే.. నీటిలో తోశేశావ్
నీటిలో మునుగుతుంటే.. భయమేసింది
మాతో వచ్చింది నువ్వేనా? అనిపించింది.. నాన్న

బడికి పంపి.. విద్యావంతుల్ని చేసి
మా జీవితాలను అందంగా తీర్చిదిద్దుతావని..
మా ఊహలకు ఊపిరి పోస్తావని
ఎన్నో కలలు కన్నాం.. నీతో పంచుకున్నాం.. నాన్న

నీ మనసు నొచ్చుకుందని...
మా ఊపిరి తీశావ్
ఒక్కసారిగా.. కలలు కల్లలయ్యాయి..
ఆశలు అడియాసలయ్యాయి
మేం చేసిన తప్పేంటి.. నీతో రావడమేనా..?
ఎందుకిలా చేశావ్.. నాన్న

- చనిపోయిన చిన్నారుల ఆవేదన
- ఈనాడు నిజామాబాద్ డెస్క్


చిన్నారుల మృతదేహాలను పట్టుకొని రోదిస్తున్న తల్లి అపర్ణ

గుట్కా దందా @ బిచ్కుంద

బీదర్ నుంచి రవాణా, గోదాముల్లో నిల్వ



ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, బిచ్కుంద

నిషేధిత గుట్కా వ్యాపారం బిచ్కుందలో 'మూడు పువ్వులు ఆరు కాయలు' అనే చందంగా సాగుతోంది. కామారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతం కావడం, సమీపంలోనే కర్ణాటక రాష్ట్రం ఉండడంతో అక్రమార్కులు అవకాశంగా మలుచుకుంటున్నారు. బిచ్కుంద ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారులు, చోటా నేతలు ముఠాగా ఏర్పడి అక్రమ రవాణా సాగిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. నియంత్రించాల్సిన ఆహార కల్తీ నియంత్రణ శాఖ, పోలీసులు 'మామూలు'గా తీసుకుంటున్నారు.

ఇతర ప్రాంతాలకూ తరలిస్తూ..

కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి వ్యాపారులు బిచ్కుందకు రాత్రి, పగలు తేడా లేకుండా గుట్కా రవాణా చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో నిషేధం లేకపోవడం ఇక్కడి వ్యాపారులకు కలిసివస్తోంది. తెలంగాణలో గుట్కాకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. బీదర్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లావాసులే గుట్కా తయారీ పరిశ్రమలను విరివిగా స్థాపించారు. బీదర్ నుంచి బిచ్కుంద, పిట్లం మీదుగా సంగారెడ్డి, హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకూ తరలిస్తున్నారు. వారం రోజుల కిందట బీదర్ నుంచి బిచ్కుందకు మినీ వ్యాన్‌లో తరలిస్తున్న గుట్కాను పోలీసులు పట్టుకోవడమే ఇందుకు నిదర్శనం. ముఠాగా ఏర్పడిన వ్యాపారులు, చోటా నేతలు బిచ్కుంద పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లోని గోదాంలలో గుట్కాను నిల్వ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ముందుగానే సమాచారం చేరవేసి..

గుట్కా రవాణా దందా పోలీసులతో పాటు స్థానికులకు తెలిసిన బహిరంగ రహస్యమే. జీవనోపాధి నిమిత్తం స్థానికంగా గుట్కా విక్రయించుకునే వ్యాపారులపై పోలీసులు కేసులు నమోదు చేస్తూ మమ అనిపిస్తున్నారు. లారీల కొద్దీ రవాణా చేసే వ్యాపారుల జోలికి వెళ్లకుండా దాడుల సమాచారాన్ని ముందుగానే చేరవేస్తున్నారు. వ్యాపారులకు పోలీసుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి.

నిండు జీవితాలు బలి

విచ్చలవిడిగా లభిస్తున్న గుట్కా, పాన్‌మసాలా ఉత్పత్తుల వినియోగంతో బిచ్కుంద పట్టణానికి చెందిన పలువురు యువకులు క్యాన్సర్ బారినపడ్డారు. గడిచిన రెండు నెలల కాలంలో పలువురు నోటిక్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు.


బిచ్కుంద పోలీసులు పట్టుకున్న బీదర్ నుంచి రవాణా చేస్తున్న గుట్కా వాహనం

కేసులు నమోదు చేస్తున్నాం

నిషేధిత గుట్కా విక్రయించిన వారిపై దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాం. స్థానిక పోలీసులకు సైతం పకడ్బందీగా నియంత్రించాలని ఆదేశాలు జారీ చేస్తాను. నిషేధిత వస్తువులను రవాణా చేసినా, విక్రయించినా, నిల్వ చేసినా చట్టరీత్యా నేరం. **- సింధుశర్మ, ఎస్పీ, కామారెడ్డి**


మాచారెడ్డిలో దుర్గామాత శోభాయాత్రలో యువకుల విన్యాసాలు


నస్రుల్లాబాద్‌లో ఊరేగింపుగా..

దుర్గమ్మ.. వెళ్లిరావమ్మా

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు
● అట్టహాసంగా నిమజ్జనం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: అమ్మా భవానీ లోకాలనేలే.., దుర్గమ్మ.. మముగనుమా అంటూ భక్తులు శ్రద్ధతో తొమ్మిది రోజుల పాటు కొలిచారు. అర్చనలు నిర్వహించారు. పదో రోజు అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. జిల్లాకేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద, దోమకొండ, భిక్కనూరు, లింగంపేట, గాంధారి, సదాశివనగర్, మాచారెడ్డి ప్రాంతాల్లో వాహనాలపై అమ్మవారి విగ్రహాలను ఆదివారం ఏర్పాటుచేసి ఊరేగించారు. దారిపొడవునా దుర్గాదేవికి భక్తులు మంగళారతులు పట్టారు. అర్ధరాత్రి దాటాక కామారెడ్డితో పాటు ఆయా మండలాల సమీప చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.


దోమకొండలో అంబారీ రథంపై చాముండేశ్వరీ అమ్మవారి ఊరేగింపు



కోలాటంలో మహిళలు : కామారెడ్డిలో జేపీఎన్ రోడ్డులో దుర్గామాత శోభాయాత్ర

బకాయిల వసూళ్లకు కార్యాచరణ

సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు అవగాహన

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

అప్పులు చెల్లించకపోవడంతో జిల్లాలోని కొన్ని స్వయం సహాయక సంఘాల లావాదేవీలు నిలిచిపోయాయి. జిల్లావ్యాప్తంగా బ్యాంకు లింకేజీ నుంచి 747 స్వయం సహాయక సంఘాలు రూ.21.36 కోట్ల (2.75 శాతం) అప్పులు చెల్లించాల్సి ఉంది. బకాయిలు వసూలు చేయడానికి సెర్ప్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మొండి బకాయిల జాబితాలను గ్రామాల వారీగా తయారు చేసి సంఘాల వారికి అవగాహన కల్పించనున్నారు. అప్పును విడతల వారీగా చెల్లించేలా ఒప్పించడంతో పాటు ఆయా సంఘాలు మళ్లీ క్రియాశీలకంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

నాలుగు మండలాల్లో అధికం

పాత బకాయిల జాబితా పరిశీలిస్తే గాంధారి, నస్రుల్లాబాద్, మద్నూర్, జుక్కల్ మండలాల్లో అధికం(7 శాతం)గా ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా మండలాల్లో ఒకటి, రెండు శాతం బకాయిలు ఉన్నాయి. ఈ సంఘాలకు రుణాలు పూర్తిగా చెల్లించేలా సెర్ప్ అధికారులు బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్నారు. వీరికి వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. బ్యాంకులు అంగీకరిస్తే ఇందులో చాలా మంది మహిళలు అప్పులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. దీంతో అధికారులు ఆయా గ్రామాల్లో ప్రతి వారం సంఘ సమావేశాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముందుగా బకాయిలు ఉన్న వారికి అవగాహన కల్పించనున్నారు.

'అన్ని స్వయం సహాయక సంఘాలు క్రియాశీలకంగా ఉండాలనేది మా లక్ష్యం. జిల్లాలో పాత బకాయిలు చెల్లించేలా మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్నాం. వన్‌టైం సెటిల్‌మెంట్ చేసే విధంగా బ్యాంకులతో మాట్లాడుతున్నాం.' అని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాల వివరాలు(రూ.ల్లో)

వార్షిక ఏడాది	రుణ లక్ష్యం	అప్పు తీసుకున్న సంఘాలు	సాధించిన లక్ష్యం
2023-24	665 కోట్లు	12,079	687 కోట్లు
2024-25	802 కోట్లు	5,557	406 కోట్లు

విద్యుత్తు శాఖలో బదిలీలు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న అధికారుల బదిలీలు పూర్తయ్యాయి. రెండు సంవత్సరాలుగా ఒకే చోట పనిచేస్తున్న వారికి బదిలీలు జరిగాయి. కిందిస్థాయి ఉద్యోగుల నుంచి ఏడీ స్థాయి వరకు బదిలీలు పూర్తి చేశారు. ఎస్ఈ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ప్రక్రియ కొనసాగింది.

అధికారి పేరు	ప్ర.ప.స్థానం	బదిలీ అయింది
ఏడీలు		
కిరణ్‌చైతన్య	దోమకొండ	కామారెడ్డి(కన్‌స్ట్రక్షన్)
సుదర్శన్‌రెడ్డి	ఎల్లారెడ్డి	దోమకొండ
మల్లేష్	కామారెడ్డి(కమర్షియల్)	లింగంపేట
ఏఈలు		
అరవింద్	మద్నూర్	బాన్సువాడ
లక్ష్మణ్	కామారెడ్డి పట్టణం-3	గాంధారి
రామలక్ష్మి	భిక్కనూరు, నార్త్	కామారెడ్డి పట్టణం-3
జ్యోతి	కామారెడ్డి పట్టణం-2	నాగిరెడ్డిపేట
నాందేవ్	బాన్సువాడ	రాజంపేట
ప్రదీప్‌కుమార్	దోమకొండ	కామారెడ్డి, హెచ్‌టీ మీటర్స్
వెంకటరమణాచారి	మాచారెడ్డి	ఎల్లారెడ్డి
హన్మంత్‌రెడ్డి	కామారెడ్డి, ఎంఆర్‌టీ	కామారెడ్డి, టీఆర్ఈ
దివ్యగాయత్రి	బీబీపేట	బాన్సువాడ
మనోరంజన్	నాగిరెడ్డిపేట	కామారెడ్డి, ఎంఆర్‌టీ
సతీష్‌రెడ్డి	గాంధారి	కామారెడ్డి, టెక్నికల్
వెంకటేశ్	కామారెడ్డి, కమర్షియల్	కామారెడ్డి పట్టణం, 2
తిరుపతిరెడ్డి	ఎల్లారెడ్డి, డీవో	మాచారెడ్డి
ధర్మయ్య	సదాశివనగర్	కామారెడ్డి, కమర్షియల్
గోపికృష్ణ	కామారెడ్డి, టీఆర్ఈ	మద్నూర్
బాలాజీ	బాన్సువాడ	భిక్కనూరు, నార్త్

ప్ర.ప.స్థానం : ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం

దసరా కిక్కు..

మాక్లూర్ : దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఏకంగా రూ.20 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 151 వైన్స్‌లు, 21 బార్లు ఉన్నాయి. వాటికి మాక్లూర్ మండలం మాదాపూర్‌లోని ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) డిపో నుంచి విస్కీ, బీరు సరఫరా అవుతోంది. పండుగ సందర్భంగా కేవలం మూడు రోజుల్లో రూ.20 కోట్ల విలువైన 40 వేల కేసుల బీరు, 20 వేల కేసుల విస్కీ అమ్మకాలు జరిగాయి.

వీరి సేవ.. భిన్నమైన తోవ

● ఆదర్శంగా నిలుస్తున్న యువజన సంఘాలు

యువత చాలా మంది ఉన్నా కొందరే భిన్నమైన పంథా ఎంచుకుంటారు. ఇతరుల సమస్యలపై స్పందించి తమ వంతుగా పరిష్కరించేందుకు చూస్తారు. సామాజిక ఇబ్బందులుంటే తమ స్థాయిలో తొలగించేందుకు కృషి చేస్తారు.. అలాంటి యువకులే వీరు.. కొందరు సంఘంగా ఏర్పడి తమ పల్లెల రూపురేఖలు మార్చేందుకు నడుంబిగిస్తే.. మరికొందరు అభాగ్యులకు అన్నం పెట్టి ఆకలి తీరుస్తున్నారు.. ఆదర్శంగా నిలుస్తున్న వీరిపై ప్రత్యేక కథనం..

న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ

ఐదేళ్లుగా.. రూ.20 లక్షల ఖర్చు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: 'మానవ సేవే మాధవ సేవ' నినాదంతో 2019 డిసెంబరు 1న శ్రీలక్ష్మి చేయూత స్వచ్ఛంద సేవా సంస్థను అలవాల లక్ష్మణ్, వంగల రమణాచారి, తాటి శ్యామ్‌కుమార్‌తో పాటు మరో 20 మంది సభ్యులు కలిసి ప్రారంభించారు. ప్రస్తుతం సంస్థలో 170 మంది సభ్యులున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, అంతిమయాత్ర నిర్వహించుకోలేని వారిని గుర్తించి రూ.5-10 వేల వరకు ఇస్తారు. ఎవరైనా అనుకోని ఘటనతో వీధిన పడితే మూడు నెలలకు సరిపడా సరకులు అందిస్తారు. పేద అమ్మాయిల పెళ్లిళ్లకు పుస్తె, మెట్టెలు, రూ.30 వేల నగదు, వంట సామగ్రి అందజేస్తారు. నిజామాబాద్‌తో పాటు నిర్మల్, జగిత్యాల, కామారెడ్డిలో సేవలు కొనసాగిస్తున్నారు. ఈ ఐదేళ్లలో రూ.20 లక్షలు సేవా కార్యక్రమాలకు వెచ్చించడం గమనార్హం.


బాధిత కుటుంబానికి రూ.10 వేలు సాయం అందిస్తున్న ప్రతినిధులు

ఆకలి తీరుస్తూ..

ఆర్మూర్ పట్టణం మామిడిపల్లికి చెందిన స్నేహితులు 2022 సెప్టెంబరులో కింగ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా నిరాశ్రయులకు నిత్యం అన్నం పెడుతూ కడుపు నింపుతున్నారు. నిత్యం 200 మందికి అన్నదానం చేస్తున్నారు. వీరిని చూసి ఆర్మూర్ పట్టణానికి చెందిన మరికొందరు ముందుకొచ్చారు. ఇందు కోసం సంఘంలోని సభ్యులే డబ్బులు వేసుకుంటారు. వీరి సేవలను పట్టణ ప్రజలు కొనియాడుతున్నారు.


ఆహారం అందిస్తున్న కింగ్ ఫౌండేషన్ సభ్యుడు

న్యూస్‌టుడే ఇందూర్ సిటీ,

గ్రామ రూపురేఖలు మార్చేందుకు

నిజామాబాద్ గ్రామీణ మండలం కొండూర్ యువత తమ పల్లె అభివృద్ధికి నడుం బిగించారు. 2006లో 40 మందితో వాయుపుత్ర యూత్ సొసైటీ ఏర్పాటు చేశారు. గ్రామ సమస్యల పరిష్కారానికి నిత్యం కొంత సమయం కేటాయిస్తారు. పరిశుభ్రత, క్రీడలు, మొక్కల పెంపకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా డబ్బాలు ఏర్పాటు చేశారు. నెహ్రూ యువ కేంద్రం ప్రోత్సాహంతో మండలంలో ఇతర పల్లెల్లోనూ ఇంకుడు గుంతలు నిర్మించారు. సీజనల్ వ్యాధులు, గర్భిణులకు ఆహార అలవాట్లు, ఆరోగ్య శిబిరాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో నిరుద్యోగ యువతకు ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు మూడుసార్లు జిల్లా ఉత్తమ యువజన సంఘంగా పురస్కారం అందుకున్నారు.


చెత్త సేకరించి డబ్బాలో వేస్తున్న వాయుపుత్ర యూత్ సొసైటీ సభ్యులు



జీవాల విక్రయం @ ₹4కోట్లు

రాష్ట్రంలోనే అతి పెద్ద మేకల అంగడి నవీపేటలో నిర్వహిస్తారు. ప్రతి శనివారం సగటున రూ.కోటికి పైగా వ్యాపారం జరుగుతుంది. ఈ సారి దసరా పండగ రోజే అంగడి రావడంతో సుమారు రూ.4కోట్ల జీవాల విక్రయాలు జరిగినట్లు వ్యాపార వర్గాలు పేర్కొన్నారు. 8వేలకు పైగా మేకలు, గొర్రెలను వ్యాపారులు సంతకు తీసుకువచ్చారు. మహారాష్ట్రతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి జీవాలు కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అంగడి కిక్కిరిసిపోయింది. పది కిలోల పొట్టేలు రూ.12 వేల నుంచి 14 వేలు పలికింది. భారీ సంఖ్యలో కొనుగోలుదారులు రావడంతో నవీపేటలోని రోడ్లు రద్దీగా మారాయి. మధ్యాహ్నం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

– న్యూస్‌టుడే, నవీపేట

సమస్యలు అధికం.. మరమ్మతుల్లో జాప్యం

● డొంకేశ్వర్ పీహెచ్‌సీలో పూర్తికాని పనులు

న్యూస్‌టుడే, నందిపేట్

జిల్లాకు శివారు మండలం డొంకేశ్వర్. ఉమ్మడి నందిపేట్ మండలంలోని 16 గ్రామాల ప్రజలకు వైద్యానికి డొంకేశ్వర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే ప్రధాన ఆధారం. కానీ ఇక్కడ సరైన వసతులు లేక రోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. సమస్యను గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులకు రూ.15 లక్షలు మంజూరు చేసింది. కానీ పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి త్వరగా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

ఏయే సమస్యలంటే..

ఆసుపత్రిలోని గోడలు, గదుల్లోని అడుగు భాగం ధ్వంసమైంది. విద్యుత్తు వ్యవస్థ చెడిపోయింది. పైపులైను అస్తవ్యస్తంగా మారడంతో లీకేజీలు ఏర్పడ్డాయి. గతంలో నిర్మించిన ప్రహరీ కూలిపోవడంతో పశువులు ప్రాంగణంలోకి వస్తున్నాయి. పరిసరాల్లోని సీసీ ప్లాట్‌ఫాం లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. పీహెచ్‌సీలోని సమస్యలను రోగులు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లగా 14 నెలల కిందట నిధులు విడుదలయ్యాయి. టెండరు, ఒప్పంద ప్రక్రియ ముగిసి కొన్ని పనులు చేపట్టి బిల్లులు కూడా తీసుకున్నారు. మిగతా పనులు చేయడం లేదు. ఈ విషయమై ప్రజలు ఏడాదిగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు..


అధ్వానంగా నీటి కుళాయి


ప్రవేశ ద్వారం ఎదుట ఇలా..


పగిలిన టైల్స్

డొంకేశ్వర్ పీహెచ్‌సీ స్వరూపం

- పరిధిలోని ఉప కేంద్రాలు - 06
- వైద్యం కోసం వచ్చే గ్రామాలు - 16
- నిత్యం ఓపీ - 50 నుంచి 60

ఇబ్బందులు పడుతున్నాం

- సురేందర్, పీహెచ్‌సీ పర్యవేక్షకుడు

పెండింగ్ పనులు చేయకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. పశువుల సంచారం, పిచ్చి మొక్కలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

త్వరలో పూర్తిచేస్తాం

- రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ

నేను మండలానికి ఇటీవలే వచ్చాను. పనులు పెండింగ్‌లో ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. గుత్తేదారుతో మాట్లాడాం.. త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించాం. వీలైనంత త్వరగా మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.



నేడు కలిగోట్‌లో బతుకమ్మ సంబురాలు

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్‌లో బతుకమ్మ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. దసరా పర్వదినం తరువాత (ఈ నెల 14న) ఉత్సవాలు జరపడం ఇక్కడ ఆనవాయితీ. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆడపడుచులు అత్తగారింట్లో దసరా పర్వదినం వరకు బతుకమ్మ ఆడి ఆ తర్వాత పుట్టింటికి చేరుకుని ఇక్కడ మరోసారి ఉత్సవాల్లో పాల్గొంటారు. గ్రామంలో విశాలమైన ప్రాంతంలో ప్రత్యేకంగా సిమెంట్‌తో బతుకమ్మను తయారు చేశారు. మహిళలు దాని చుట్టూ బతుకమ్మ ఆడుతూ సందడి చేస్తారు.

కోటపై దసరా ఉత్సవం

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలో దసరా ఉత్సవం సంబరంగా జరిగింది. శనివారం సాయంత్రం బురుజు వద్ద ఆయుధ పూజ నిర్వహించారు. కోటపై జాతీయ జెండాను గ్రామ ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఆనవాయితీ ప్రకారం గ్రామ పెద్ద ఒకరు శమీ వృక్షాన్ని ఎత్తుకోగా, ఎదుర్కొని చాముండేశ్వరీ ఆలయానికి వెళ్లారు. అక్కడ బ్రాహ్మణులు శమీ పూజ చేశారు. గ్రామ ఆదాయ, వ్యయాలను రాసి చదివారు. పూజ చేసిన శమీ వృక్షాన్ని చాలా మంది తాకడానికి పోటీ పడ్డారు. అనంతరం గ్రామ పెద్దలకు కంకణాలను కులాల వారిగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ పన్యాల నాగరాజురెడ్డి, మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచి అంజలి, కుంచాల శేఖర్, ఐరేని నర్సయ్య, నర్సారెడ్డి, కదిరె గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దోమకొండ కోటపై జెండా ఎగురవేస్తున్న గ్రామ ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్

రైతులకు లక్ష్మి కటాక్షం!

● ఏటా రెండు పంటలకు సాగునీరు
● 34,060 ఎకరాలు సస్యశ్యామలం

బీడు భూములకు సాగు నీటిని అందిస్తూ సస్యశ్యామలం చేస్తోంది లక్ష్మి కాల్వ. శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి ఎక్కువగా ప్రయోజనం పొందుతుంది ఈ కాల్వ ఆయకట్టు రైతులే. బాల్కొండ, ముప్కాల్, మెండోరా, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లో సాగు నీటిని అందిస్తోంది. ఈ ప్రాంత రైతుల ధాన్యాగారంగా, సిరులు కురిపించే కాల్వగా పేరుగాంచింది.


లక్ష్మి ప్రధాన కాల్వ

న్యూస్‌టుడే, బాల్కొండ

అధికారిక లెక్కల ప్రకారం 34,060 ఎకరాల చొప్పున ఏటా వానాకాలం, యాసంగి పంటలకు నీరందుతుంది. భూగర్భ జలాలు పెరగడం ద్వారా వేల ఎకరాలకు లబ్ధిచేకూరుతోంది. 38 ఏళ్ల కింద లక్ష్మి కాల్వ నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి పంటలకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ సాగు భూములను సస్యశ్యామలం చేస్తోంది.

రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. గతంలో రైతులు సాగు నీటి కోసం బోరుబావులు తవ్వించుకునేవారు. నిజాంసాగర్ నీటి కోసం ఎదురు చూసే వారు. కాని లక్ష్మి కాల్వతో సాగు నీటి కష్టాలు తీరాయి. ఏటా రెండు పంటలు పండుతున్నాయి. గ్రామాల్లో చెరువులు నింపడంతో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి.

డిస్ట్రిబ్యూటరీ	ఆయకట్టు(ఎకరాల్లో)	నీళ్లు అందే మండలాలు
1	120	ముప్కాల్
2	4,505	ముప్కాల్, మెండోరా
3	17,298	ముప్కాల్, బాల్కొండ, మోర్తాడ్, వేల్పూర్
4	3,840	ముప్కాల్, మోర్తాడ్
చౌట్‌పల్లి హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతలు	8,297	మోర్తాడ్, కమ్మర్‌పల్లి

వేసవిలో పశువులకు తాగునీటి కొరత లేకుండా పోయింది.

ప్రత్యేకంగా హెడ్‌రెగ్యులేటర్ నిర్మాణం


శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మి కాల్వకు నీటిని అందించడానికి ముప్కాల్ శివారులో హెడ్‌రెగ్యులేటర్ నిర్మించారు. 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉంది. ప్రధాన కాల్వ కొత్తపల్లి శివారు వరకు ఉంది. దీనికి నాలుగు డిస్ట్రిబ్యూటర్లు ఉన్నాయి. నాలుగో డిస్ట్రిబ్యూటరీ ద్వారా షెట్‌పల్లి వద్ద చౌట్‌పల్లి హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతలకు నీరందుతుంది. మూడో డిస్ట్రిబ్యూటరీ కాలువ పెద్దది. దీని కింద ఎక్కువ ఆయకట్టు ఉంది.

సాగు నీటికి ఢోకా లేదు

...బుల్లెట్ రాంరెడ్డి, రైతు, రెంజర్ల



లక్ష్మి కాల్వ నిర్మాణంతో సాగునీటికి ఢోకా లేదు. పంటలకు పుష్కలంగా నీరందుతుంది. సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. బోర్లు బాగా నీటిని పోస్తున్నాయి. చెరువులు సైతం నింపడం వల్ల జలకళ సంతరించుకున్నాయి. నీటి ఇబ్బందులు తొలిగి పంటలు బాగా పండుతున్నాయి. రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారు.



కల్వర్టు ధ్వంసం

పది కాలాల పాటు మన్నాల్సిన ప్రగతి పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేక పనుల నాణ్యత తేలిపోతోంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో గోదాం రోడ్డు నుంచి బతుకమ్మకుంట వెళ్లేదారిలో కల్వర్టు ధ్వంసమైంది. కూలడానికి సిద్ధంగా ఉంది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టకపోతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం


కూలడానికి సిద్ధంగా..

మతసామరస్యం చాటిన యువకులు

● దుర్గమ్మ చీర, కలశం స్వీకరణ

పోతంగల్, ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే : దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ చీర, కలశాన్ని నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు ముస్లిం యువకులు వేర్వేరు చోట్ల స్వీకరించి మతసామరస్యం చాటారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పోతంగల్ మండలం కల్లూరు గ్రామంలో దుర్గామాత నిమజ్జనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించిన చీరలకు వేలం ఏర్పాటు చేశారు. అందులో పాల్గొన్న గ్రామానికి చెందిన ఎం.డి.అమీన్ ఒక్క చీరను రూ.3వేలకు దక్కించుకున్నారు. అలాగే ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లికి చెందిన మహ్మద్ సాజిద్ గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద పూజల్లో పాల్గొని పూజలందుకున్న కలశాన్ని తన కుటుంబ సభ్యులతో కలిసి స్వీకరించారు. సాజిద్ కుల, మతాలకు అతీతంగా గ్రామంలో జరిగే అన్ని వేడుకల్లో పాల్గొంటారు. ఈ మేరకు సదరు యువకుడిని కౌన్సిలర్లు, వీడీసీ ప్రతినిధులు అభినందించారు.


అమీన్‌కు అమ్మవారి చీర అందిస్తున్న నిర్వాహకులు


కలశం స్వీకరించిన మహ్మద్ సాజిద్

మధుసూదనాచారికి సన్మానం

కామారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: శాసనమండలి ప్రతిపక్షనేతగా ఎన్నికైన మధుసూదనాచారిని ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ ఆదివారం సన్మానించారు. ఆయనను కలిసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు.



కోతులను తరుముతూ.. విద్యుదాఘాతానికి గురై

● బండరామేశ్వర్‌పల్లిలో బాలుడి మృతి



మాచారెడ్డి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన మాచారెడ్డి మండలం బండరామేశ్వర్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శనిగిరి రాజేశ్(16) శనివారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. వరి పొలంలో ఉన్న కోతులను పచ్చి కట్టెతో వెళ్లగొడుతున్న క్రమంలో.. కట్టె 11 కేవీ విద్యుత్తు తీగలకు తాకి అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి అయినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

దసరా కలిపింది...



సదాశివనగర్ : నాలుగు తరాలకు చెందిన కుటుంబ సభ్యులను దసరా పండగ ఒకటి చేసింది. వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి పుట్టిన ఊరు వేదికైంది. సదాశివనగర్ మండలం భూంపల్లికి చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేశ్వర్‌రావుకు చెందిన నాలుగు తరాల కుటుంబాలు ఒక చోటుకి చేరాయి. పిల్లలు, పెద్దలు సొంత ఊరులో పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. సంబంధ బాంధవ్యాలు కృత్రిమంగా మారిపోతున్న ఈ రోజుల్లో భవిష్యత్తు తరాలకు కుటుంబ విలువలు, పండగల ఔన్నత్యం చాటి చెప్పాలనే ఉద్దేశంతో ఏటా స్వగ్రామానికి వచ్చి పండగను జరుపుకుంటామని కుటుంబ సభ్యులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242



★ జిల్లా కేంద్రంలోని వాసవీనగర్‌లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. అధికారులు స్పందించాలి. **- రమేశ్, వాసవీనగర్**

★ విద్యుత్తు వృథా కాకుండా సరఫరా ఆపేలా సిబ్బందికి సూచిస్తా. **- అంజల్‌రెడ్డి, కౌన్సిలర్**



★ జిల్లా కేంద్రంలోని సైలన్ బాబాకాలనీలో కుక్కల బెడద నెలకొంది. చర్యలు తీసుకోవాలి. **- పండరి, సైలన్‌బాబాకాలనీ**

★ కుక్కలను పట్టుకుని సంతతి నియంత్రణ కేంద్రానికి తరలిస్తాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

★ అంబారిపేటలోని ఎస్సీ కాలనీలో బోరు మోటారు చెడిపోయింది. పట్టించుకోవటం లేదు. **- నవీన్, అంబారిపేట**

★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. **- నరేందర్, గ్రామ ప్రత్యేకాధికారి, అంబారిపేట**



★ జిల్లా కేంద్రంలోని పాతబస్టాండు నుంచి గోదాం రోడ్డు వెళ్లే దారిలో చెత్త పేరుకుపోయింది. **- గోవర్ధన్, పాతబస్టాండు ప్రాంతం**



★ చెత్త తొలగించేలా సిబ్బందికి ఆదేశాలిచ్చా. చర్యలు తీసుకున్నాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

★ జిల్లా కేంద్రంలోని పీహెచ్ కాలనీలో చెత్త పేరుకుపోయింది. **- భాస్కర్, పీహెచ్ కాలనీ**

★ సిబ్బందితో చెత్త తొలగింపజేశాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



★ ఉప్పల్‌వాయి గ్రామంలో కొన్ని రోజుల క్రితం రైల్వే గేటు వద్ద మరమ్మతులు చేపట్టడంతో కంకర తేలి వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యపై మేమున్నాం మీకు తోడుగాలో కథనం ప్రచురితమవడంతో రైల్వే అధికారులు స్పందించి గుత్తేదారుడితో బీటీ రోడ్డు వేయించారు. వాహనదారులకు ఇబ్బందులు తొలగించారు.



★ బాన్సువాడ వాసవీకాలనీలో పలు చోట్ల మురుగు కాల్వల వెంట చెత్త నిల్వలు పేరుకుపోయాయి. **- ప్రవీణ్, బాన్సువాడ**

★: ఈ విషయాన్ని పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత చెత్త నిల్వలు తీయించి సమస్య పరిష్కరించారు.

★ పిట్లం మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీలోని వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వస్తోంది. **కాశీరాం, స్థానికుడు**

★: చెత్తను తొలగించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతాం. **యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం.**

- న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం,పిట్లం, దోమకొండ, బాన్సువాడ పట్టణం, రామారెడ్డి

శంకర్‌రావు పటేల్ యువతకు స్ఫూర్తి

జుక్కల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ కొలువు నిర్వహిస్తూనే.. గ్రామ ప్రజలకు సేవలు అందించిన శంకర్‌రావు పటేల్ లాడేగావ్ గ్రామ యువతకు స్ఫూర్తి అని యువకులు కొనియాడారు. గతంలో వీఆర్వోగా.. కొన్నాళ్లు పీఆర్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి, ఇటీవల పదవీ విమరణ పొందిన శంకర్‌రావు పటేల్ దంపతులను ఆదివారం శాలువాతో సన్మానించారు. రాజశేఖర్ పటేల్, విజయ్ పటేల్, పండరి, రాముల, సతీష్, బాల్‌రాజు, రమేష్, హన్మంత్, తులసిరాం, సచిన్, సునీల్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దసరా క్రికెట్ పోటీలు

గాంధారి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూర్పు రాజులు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన దసరా క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ప్రథమ విజేతగా రఘు , ద్వితీయ స్థానంలో ప్రశాంత్ జట్లు నిలిచాయని నిర్వాహకులు సజన్‌రాజ్ తెలిపారు. ఎస్సై ఆంజనేయులు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆకుల శ్రీనివాస్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ పరమేశ్, వైస్‌ఛైర్మన్ ఆకుల లక్ష్మణ్, మాజీ సర్పంచి సంజీవ్, బాబా, బాలు, సంతోష్, గ్రామస్థులు ప్రకాష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై ఆంజనేయులు, నాయకులు



ఉత్సవాల్లో ఎమ్మెల్యే పోచారం, ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్



గౌరారంలో 56 అడుగుల హనుమంతుని జెండా ఆవిష్కరణ



కామారెడ్డి: పూజ చేసిన మాజీ విప్ గంప గోవర్ధన్



జుక్కల్: సతీమణి అర్చనతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తోట



ఎల్లారెడ్డి : వేడుకల్లో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



షబ్బీర్‌అలీని కలిసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

శమీపూజలు... శోభాయాత్రలు

దసరా ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరిపారు. దశమి నాడు వాహన, శమీపూజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు బంగారం ఇచ్చి పుచ్చుకున్నారు. పలు ప్రాంతాల్లో రావణ దహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం మేళతాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రలు నిర్వహించారు. సమీపంలోని జలాశయాల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కామారెడ్డి మండలం గర్గుల్‌లో ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా కార్యక్రమం జరిగింది. జబర్దస్త్ హాస్యనటుడు వేణు, చిట్టిబాబు బృందం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. వర్షిణి బృందం ఆధ్వర్యంలో ఆడిపాడారు. **- న్యూస్‌టుడే, బృందం**



దేశాయిపేటలో..




తాడ్వాయిలో ..



నాగిరెడ్డిపేట్ : తాండూరులో ..



కామారెడ్డి: ఆదివారం రాత్రి సిరిసిల్లరోడ్డులో



మాచారెడ్డిలో..



జనగామలో..



బిచ్కుంద: జంబి చెట్టుకు హారతి ఇస్తున్న సోమయప్ప స్వామి

కామారెడ్డి: ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ సింధుశర్మ, పోలీసు అధికారులు

సదాశివనగర్ : కుప్రియాల్‌లో

కామారెడ్డి: ఇందిరాచౌక్ వద్ద యాత్రలో..



గాంధారిలో ..

నాగిరెడ్డిపేట్ : పోచారంలో

లింగంపేటలో..

నస్రుల్లాబాద్‌లో..

చుక్కాపూర్‌లో ..



పుల్కల్‌లో ..

పిట్లంలో ..

కామారెడ్డిలో

బాన్సువాడలో కోట దుర్గమ్మ

భిక్కనూరు: జంగంపల్లిలో..

కామారెడ్డి: పెద్దబజార్‌లో ..



అల్లాపూర్‌లో

దోమకొండలో..

దోమకొండలో..

దోమకొండలో

బిచ్కుందలో..



తిప్పాపూర్‌లో..



పెద్దకొడప్‌గల్ : పోచారంలో..

తుజాల్‌పూర్‌లో ...

రామారెడ్డిలో ..

తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో ఆయుధపూజ

‘అనుచిత వ్యాఖ్యలు సరికాదు’

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వర్ని మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నియోజకవర్గం నుంచి తనను ఎవరూ వెళ్లమనలేదన్నారు. తాను ఎక్కడికి వెళ్లేది లేదన్నారు. సమావేశంలో నాయకులు గణేష్, భాస్కర్, శ్రీనివాస్‌రావు, కమలాకర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

అలయ్ బలయ్

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రీయ హిందూసేనా, బజరంగీ వ్యాయామశాల ఆధ్వర్యంలో దసరా సందర్భంగా అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం

లింగుపల్లి(దోమకొండ), న్యూస్‌టుడే: మండలంలోని లింగుపల్లిలో గ్రామదేవతల ఆలయాల అభివృద్ధికి ముత్యంపేట మాజీ ఉపసర్పంచి శిరీష్ గౌడ్ రూ20,000 విరాళంగా ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు పెద్దోళ్ల లస్మయ్య, డైరెక్టర్ ఆంజనేయులు, సిద్ధరాములు, ఏసుదాసు, శ్రీహరి, గంగు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని నల్లపోచమ్మ ఆలయ అభివృద్ధికి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్-గాయత్రిల కూతురు శ్రావణి రూ. 21,110 నగదును కమిటీ అధ్యక్షుడు ఆశంశెట్టి పోచయ్యకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పన్యాల బాపురెడ్డి, బుర్రి రవి, కదిరె మోహన్‌రెడ్డి, బొమ్మెర గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

బీర్కూర్, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ తిరుమల దేవస్థానాన్ని ఆదివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఐదు డీఏలు, వైద్య బిల్లులు, జీపీఎఫ్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుశాల్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల బాధ్యుల నియామకం

భిక్కనూరు, న్యూస్‌టుడే: బస్వాపూర్, కాచాపూర్ సింగిల్ విండోలకు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీ బాధ్యులను నియమిస్తూ జిల్లా సహకార అధికారి రామమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. బస్వాపూర్ విండో బాధ్యుడిగా మల్లారెడ్డి, కాచాపూర్ విండో బాధ్యునిగా కిష్టాగౌడ్‌లను నియమించారు. వీరి మూడు నెలలు లేదా నూతన కమిటీ ఎన్నికయ్యే వరకు పదవిలో కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఉత్వర్వుల కాపీని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చేతుల మీదుగా కిష్టాగౌడ్ శనివారం అందుకున్నారు.

ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు

పిట్లం, న్యూస్‌టుడే: పిట్లం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని త్రిషుల్ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 16 మందికి వైద్యురాలు రష్మిత పరీక్షలు నిర్వహించగా షుగర్ నిర్ధారణ అయిన నలుగురికి నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేసి, పలు సూచనలు చేశారు. క్లబ్ అధ్యక్షుడు కాశిరెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, ఆసుపత్రి యాజమాన్యం సుభాకర్, దయానంద్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

దోమకొండ: దోమకొండలోని అయ్యప్ప సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావులపల్లి నర్సారెడ్డి, ఉపాధ్యక్షుడిగా శెట్పల్లి శ్రీనివాస్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా కంది వినోద్, కోశాధికారిగా ఎర్ర నరేందర్, సహాయ కార్యదర్శిగా పన్యాల బాపురెడ్డిలను ఎన్నుకున్నారు.

భవానీ మాలధారుల ఆందోళన

బాన్సువాడ, న్యూస్‌టుడే: కొయ్యగుట్ట సమీపంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. దీంతో వాహనదారుల మధ్య గొడవ మొదలైంది. ఒక ద్విచక్రవాహనంపై భవానీ మాలధారి ఉండటంతో మాల చినిగింది. ఈ విషయం తెలిసి ఇతర భవానీస్వాములు వచ్చి ఆందోళనకు దిగారు. రాజీవ్‌చౌరస్తాలో రాస్తారోకో చేశారు. డీఎస్పీ సత్యనారాయణ అక్కడికి చేరుకొని ఇరువురితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మాలధారులు నిరసన విరమించారు.

వాహనం అదుపుతప్పి మృతి

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: కొత్త ఫోన్ కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి నస్రుల్లాబాద్ శివారులో చోటుచేసుకుంది. ఏఎస్సై వెంకట్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడకు చెందిన కొండా మణికంఠ (22) అనే యువకుడు బాన్సువాడలో మార్బుల్స్ దుకాణంలో పని చేసేవాడు. దసరా పండగ సందర్భంగా కొత్త ఫోన్ కొనుగోలు చేయడానికి అతని స్నేహితుడు విజయ్‌తో కలిసి శనివారం మధ్యాహ్నం నిజామాబాద్ వెళ్లారు. ఫోన్ తీసుకుని ద్విచక్ర వాహనంపై బాన్సువాడకు తిరిగి వస్తుండగా నస్రుల్లాబాద్ శివారులో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. విజయ్‌కు స్వల్ప గాయాలు కాగా వీరిని నిజామాబాద్ దవాఖానాకు తరలించారు. మణికంఠ శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై వివరించారు.



మణికంఠ

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

కామారెడ్డి నేరవిభాగం: కామారెడ్డి జిల్లాకేంద్రం సమీపంలోని పొందుర్తి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సలీం(36) మృతి చెందినట్లు దేవునిపల్లి పోలీసులు తెలిపారు. మోటారు సైకిల్‌పై వెళుతుండగా కుక్క అడ్డురావడంతో ప్రమాదం జరిగిందన్నారు. భార్య నస్రిన్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కూతురి మృతితో అల్లుడి కుటుంబంపై దాడి

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: కూతురు మృతి చెందడంతో అల్లుడు, అతని బంధువులపై పుట్టింటి వారు దాడి చేసిన సంఘటన నాగిరెడ్డిపేట్ మండలంలోని రాఘవపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వారి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పసులాది పోచవ్వ, బాలయ్య భార్యాభర్తలు. బాలయ్య హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. వారం రోజుల క్రితం పోచవ్వ (42) మెట్లపై నుంచి పడడంతో గాయాలపాలైంది. వెంటనే నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సరైన వైద్యం అందక తన కూతురు మృతి చెందిందని ఆగ్రహించిన పుట్టింటి వారు బాలయ్య, అతని బంధువులు, కుటుంబసభ్యులపై కర్రలతో దాడి చేసి చితకబాదినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని ఠాణా సిబ్బంది చెప్పారు.

యువకుడిపై మాజీ ఉపసర్పంచి ...

భిక్కనూరు, న్యూస్‌టుడే: బస్వాపూర్‌లో ఆదివారం యువకుడు సందీప్‌పై మాజీ ఉపసర్పంచి దాడి చేయడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. యువకుడిపై దాడిని ఖండిస్తూ గ్రామంలోని యువత ఓ చోట గుమిగూడి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సై సాయికుమార్ తన సిబ్బందితో కలిసి వారిని శాంతింప చేశారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ రాజకీయ పార్టీ వాట్సాప్ గ్రూప్‌లో నుంచి ఇద్దరు యువకుల నంబర్లను ఆదివారం తొలగించారు. తమను వాట్సాప్ గ్రూపు నుంచి ఎందుకు తొలగించారని సదరు యువకులు పార్టీ గ్రామ అధ్యక్షుడిని ప్రశ్నించారు. ఈ విషయమై ఆగ్రహించిన మాజీ ఉప సర్పంచి ఆగ్రహంతో మద్యం మత్తులో దుర్భాషలాడుతూ బెదిరించడంతో పాటు తనపై దాడి చేశాడని యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో సైతం తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. అనంతరం బాధితుడు భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇద్దరికి గాయాలు

గాంధారి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రం శివారులోని మార్కండేయ ఆలయం సమీపంలోని నేరల్ తండా రహదారికి వెళ్లే మార్గంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం..బీర్మాల్ తండా కాటేవాడికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి ద్విచక్ర వాహనంపై గాంధారికి వస్తున్న క్రమంలో వాహనం అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకు వెళ్లింది. ఇద్దరికి గాయాలవడంతో క్షతగాత్రులను గాంధారి ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

బిచ్కుంద గ్రామీణం, న్యూస్‌టుడే: పుల్కల్ గ్రామానికి చెందిన మంగలి కాశవ్వ గృహంలో ఆదివారం రాత్రి విద్యుదాఘాతం జరిగి దూలాలకు మంటలు అంటుకొని ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సామాగ్రి, నగదు, బంగారు అభరణాలు పూర్తిగా కాలిపోయాయి. రూ. 5లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

బాన్సువాడ, న్యూస్‌టుడే: బాన్సువాడ గ్రామీణ సీఐగా రాజేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సత్యనారాయణ గౌడ్ హైదరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. సీఐడీ విభాగంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న రాజేశ్ బదిలీపై బాన్సువాడకు వచ్చారు. పలువురు సిబ్బంది, నాయకులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



రాజేశ్